సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
బుధవారం : 1 : ఫిబ్రవరి : 2023



జీవ నియంత్రణ పద్ధతులతో పైరుకు రక్షణ 8లో

జీవ నియంత్రణ పద్ధతుల ద్వారా పంటలకు రక్షణ సాధ్యమని శాస్త్రవేత్తలు సూచించారు.



శిశు మరణాలు నివారించాల్సిందే 8లో

శిశు మరణాలపై సీరియస్‌గా స్పందించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు.



లోయలోకి దూసుకెళ్లిన కారు

మారేడుమిల్లి–చింతూరు ఘాట్ రోడ్డులో కారు లోయలోకి దూసుకెళ్లిన ఘటనలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. 8లో

న్యూస్‌రీల్

డీఆర్వోగా అంబేడ్కర్ బాధ్యతలు స్వీకరణ



సాక్షి, పాడేరు: డీఆర్వోగా పి.అంబేడ్కర్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న డీఆర్వో బి.దయానిధి సెలవుపై వెళ్లడంతో ఆయన స్థానంలోని అంబేడ్కర్ నియమితులయ్యారు. బాధ్యతలు స్వీకరణ అనంతరం కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన గతంలో చింతపల్లి తహసీల్దార్‌గా పనిచేసినట్టు అంబేడ్కర్ తెలిపారు.

పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

- తగ్గుతున్న పర్యాటకుల తాకిడి
- వెలవెలబోతున్న లంబసింగి



పర్యాటక కేంద్రం లంబసింగి

చింతపల్లి: ఆంధ్రా కశ్మీర్ లంబసింగికి పర్యాటకుల తాకిడి తగ్గింది. రోజు రోజుకు ఉష్ణోగ్రతలు పెరుగుతుండడంతో పొగమంచు ప్రభావం తగ్గుతోంది. మొన్నటి వరకు 4, 5 డిగ్రీలతో వణికించిన ఉష్ణోగ్రతలు మంగళవారం చింతపల్లిలో 11 డిగ్రీలుగా నమోదైనట్లు స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు తెలిపారు. ఆంధ్రా కశ్మీర్‌గా గుర్తింపు పొందిన లంబసింగిలో ఏటా శీతాకాలంలో మంచు అందాలు కనువిందు చేస్తుంటాయి. ఎముకలు కొరికే చలిలో మంచు అందాలను తిలకించేందుకు ప్రకృతి ప్రియులు వస్తుంటారు. నవంబర్ నుంచి జనవరి నెలాఖరు వరకు వీరి తాకిడి ఉంటుంది. వివిధ రాష్ట్రాల నుంచి పర్యాటకులు వస్తుంటారు. పర్యాటక సీజన్ ముగుస్తుండటంతో లంబసింగి వెలవెలబోతోంది.

జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు ఆశ్రమ విద్యార్థి



ఎంపికైన విద్యార్థిని అభినందిస్తున్న హెచ్‌ఎం ఆనందబాబు

అడ్డతీగల: వాలీబాల్ అండర్–17 విభాగంలో జాతీయస్థాయి పోటీలకు మండలంలోని వీరవరం ఆశ్రమ ఉన్నత పాఠశాల తొమ్మిదవ తరగతి విద్యార్థి మడకం ఉదయ్ ఎంపికయ్యాడు.గత నెల జనవరి 23 నుంచి 25 వరకు కర్నూలులో జరిగిన అంతర్ జిల్లాల రాష్ట్ర ఎస్‌జీఎఫ్‌ఐ అండర్–17 పోటీల్లో ప్రతిభ కనబరిచాడు. ఉదయ్‌తోపాటు అతనికి శిక్షణ ఇచ్చిన పీఈటీ బోనెం రవికుమార్‌ను మంగళవారం పాఠశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో అభినందించినట్టు హెచ్‌ఎం మఠం ఆనందబాబు తెలిపారు.

మన్యంలో ప్యాషన్ ఫ్రూట్



ప్యాషన్ ఫ్రూట్ పాదు



రాజవొమ్మంగి: విదేశాల్లో లభించే ప్యాషన్ ఫ్రూట్స్ మన్యంలోను పండుతున్నాయి. మండలంలోని సింగంపల్లి గ్రామానికి చెందిన రైతులు కొల్లి శ్రీనివాస్, కోన అప్పన్నబాబు వీటి పెంపకం చేపట్టారు. నర్సరీల నుంచి మొక్కలు తీసుకువచ్చి పెంపకం చేపట్టారు. పోషక విలువలు ఉన్న వీటిని కొనేందుకు స్థానికులు ఆసక్తి చూపుతున్నారు. సాగుకు మన్యంలో వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని ఉద్యానవనశాఖ నిపుణులు తెలిపారు.

వైజాగ్‌కు జై



- రాజధాని విశాఖ అని సీఎం జగన్ ప్రకటన
- త్వరలోనే తాను షిఫ్ట్ అవుతానని స్పష్టీకరణ
- సర్వత్రా ఆనందోత్సాహాలు, జేజేలు
- ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకాలు



విశాఖ ఉత్తర నియోజకవర్గంలో సంబరాలు

సాక్షి, విశాఖపట్నం: మా రాజధాని విశాఖే.. త్వరలోనే సుందరి నగరి రాజధానిగా మారబోతోంది. రాబోయే నెలల్లో నేనూ అక్కడకు మారబోతున్నాను' అంటూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చేసిన ప్రకటన ఉత్తరాంధ్రవాసులను ఆనందడోలికల్లోను, సంభ్రమాశ్చర్యాల్లోను ముంచెత్తుతోంది. మంగళవారం ఢిల్లీలో జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్ల సమ్మిట్ (జీఐఎస్) సన్నాహక సదస్సులో ప్రఖ్యాత కంపెనీల ప్రతినిధులనుద్దేశించి ప్రసంగిస్తూ ఆయన ఈ సంచలన ప్రకటన చేశారు. వాస్తవానికి విశాఖను పరిపాలన రాజధానిగా చేస్తామని రెండేళ్ల క్రితమే ఆయన అసెంబ్లీ వేదికగా పలుమార్లు చెప్పారు. అయితే వివిధ కారణాలతో జాప్యం జరుగుతూ వస్తోంది. రాష్ట్రంలో మరే నగరానికి లేనంత విశిష్టత, భౌగోళిక స్వరూపం, చారిత్రక నేపథ్యం, రైలు, రోడ్డు, విమాన, సముద్ర రవాణా సౌకర్యాలు, పోర్టులు, ప్రభుత్వ, ప్రైవేటు రంగ సంస్థలు విశాఖకు ఉన్నాయి. సౌమ్య స్వభావం కలిగిన ప్రజలు, ఎక్కడి వారినైనా అక్కున చేర్చుకునే నైజం ఇక్కడి వారి సొంతం. ఆదాయం వనరులు పుష్కలంగా ఉన్న, ఏడాది పొడవునా అనుకూలమైన వాతావరణం కలిగిన, ప్రకృతి రమణీయతతో అలారారే అతి సుందర నగరం. వ్యాపార, వాణిజ్య, పారిశ్రామిక, విద్య, వైద్యర ంగాల్లోనూ అభివృద్ధి చెందిన సిటీ విశాఖ. దేశంలో అభివృద్ధి చెందిన టాప్ 10 నగరాల్లో వైజాగ్ ఒకటి. ఇలా ఒకటేమిటి? చెప్పుకుంటూ పోతే పరిపాలన రాజధానికి అవసరమైన అన్ని వనరులూ, విశిష్టతలు, సుగుణాలు ఈ మహా నగరానికి ఉన్నాయంటూ అనేకమంది మేధావులు, విద్యావేత్తలు, వివిధ రంగాల నిపుణులు ఇప్పటికే స్పష్టం చేశారు. ఈ నగర వైశిష్ట్యాన్ని కొనియాడారు.

కొన్నాళ్లుగా ఎదురు చూపులు

విశాఖ రాజధాని ఎప్పుడవుతుందా? అంటూ విశాఖ వాసులే కాదు.. ఉత్తరాంధ్ర ప్రజలు కూడా వెయ్యి కళ్లతో ఎదురు చూస్తున్నారు. వెనుకబడిన ఉత్తరాంధ్ర విశాఖ పరిపాలన రాజధానితో శరవేగంగా అభివృద్ధి చెందుతుందని ఆశగా ఉన్నారు. కొత్తగా ఈ ప్రాంతంలో మరిన్ని పరిశ్రమలు, ఐటీ సంస్థలు ఏర్పాటై ఉపాధి, ఉద్యోగావకాశాలు మెరుగుపడతాయన్న విశ్వాసంతో ఉన్నారు. విశాఖను ఎగ్జిక్యూటివ్ క్యాపిటల్‌గా చేయడం ద్వారా విశ్వసనీయతకు మారుపేరైన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశాఖతో పాటు, ఉత్తరాంధ్రను అభివృద్ధి పథంలో నడిపిస్తారన్న ఆశాభావాన్ని పలువురు వ్యక్తం చేస్తున్నారు.

సంబరాలు.. ఆనందోత్సాహాలు..

మంగళవారం సీఎం వైఎస్ జగన్ 'త్వరలో విశాఖ మా రాజధాని' అంటూ చేసిన ప్రకటనతో ఆనంద పరవశులైన నగర వాసులు సంబరాలు జరుపుకున్నారు. కేక్‌లు కట్ చేసుకున్నారు. మిఠాయిలు పంచుకున్నారు. జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకాలు చేశారు. జై విశాఖ.. జై జగన్.. అంటూ నినాదాలు చేశారు. ముఖ్యమంత్రి ప్రకటనతో రెండుళ్లుగా ఎదురు చూస్తున్న తమకు ఇక రాజధాని రావడమే తరువాయి అన్న నమ్మకం, సంతోషంతో ఉన్నారు.



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నెడ్‌క్యాప్ చైర్మన్ కేకేరాజు

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

సీతమ్మధార: ఏప్రిల్ నుంచి విశాఖ రాజధానిగా పరిపాలన సాగిస్తామని ప్రకటించిన నేపథ్యంలో ఉత్తర నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో నెడ్‌క్యాప్ చైర్మన్ కేకే రాజు ఆధ్వర్యంలో సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. కేక్ కట్ చేసి పార్టీ శ్రేణులకు పంచి పెట్టారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, ఫ్లోర్‌లీడర్ బాణాల శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ కంపా హనోక్, అల్లు శంకరరావు, స్టాండింగ్ కమిటీ మెంబర్లు బర్కత్ ఆలీ, సారిపల్లి గోవింద్, కార్పొరేటర్లు కఠారి అనిల్ కుమార్‌రాజు, సాడి పద్మారెడ్డి, ఆళ్ల లీలావతి, పి.ఉషశ్రీ, వి.ప్రసాద్, రెయ్యి వెంకటరమణ, శశికళ, సీనియర్ నాయకులు బొడ్డేటి కాశీ విశ్వనాథ్, మహ్మద్ ఫరూఖీ, వార్డు అధ్యక్షులు పైడి రమణ, నీలి రవి, రత్నాకర్, రాష్ట్ర డైరెక్టర్లు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, సభ్యులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారధులు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్రుల్లో ఉత్సాహం



రాష్ట్ర రాజధాని విశాఖపట్నం అని దేశ రాజధాని ఢిల్లీలో ముఖ్యమంత్రి వై.ఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించడం శుభపరిణామం. త్వరలోనే విశాఖ నుంచి పరిపాలన కొనసాగిస్తామని, తాను కూడా విశాఖకు నివాసం మార్చుకుంటున్నానని ప్రకటించడం ఉత్తరాంధ్ర ప్రజల్లో ఉత్సాహం నింపింది.

– పాకా సత్యనారాయణ, రాష్ట్ర అధ్యక్షుడు, వికేంద్రీకరణ పరిరక్షణ వేదిక

పెట్టుబడులు పెరుగుతాయి..



పరిపాలన రాజధాని వస్తే విశాఖలో పెట్టుబడుల వేగం ఊపందుకుంటుంది. అన్ని విధాలా ఈ ప్రాంత అభివృద్ధికి దోహదపడుతుంది. మౌలిక వసతులు మరింత పెరుగుతాయి. విమానయాన కనెక్టివిటీ కూడా వృద్ధి చెందుతుంది. రాజధాని అయితే ప్రపంచ దేశాల్లో విశాఖ నగరానికి మరింతగా గుర్తింపు లభిస్తుంది.

– ఆర్‌ఎల్ నారాయణ, చైర్మన్, ఇన్వెస్ట్‌మెంట్ కమిటీ, ఐటీ అసోసియేషన్ ఆఫ్ ఏపీ

రాజధానితో మంచి జరుగుతుంది



విశాఖ రాజధానితో ఈ ప్రాంతానికి అంతా మంచే జరుగుతుంది. రాజధానికి కావలసిన అన్ని వనరులు, మౌలిక సదుపాయాలు విశాఖలో ఉన్నాయి. ప్రభుత్వ, ప్రైవేటు రంగ సంస్థలూ ఉన్నాయి. రాష్ట్రంలో అభివృద్ధి చెందిన, అందమైన ఏకైక సిటీ విశాఖే. ఇంతటి ప్రశాంతత కలిగిన నగరం దేశంలోనే కాదు.. ప్రపంచంలోనే ఉండదంటే అతిశయోక్తి కాదు.

– పైడా కృష్ణప్రసాద్, అధ్యక్షుడు, ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్

యువతకు ఉద్యోగాలు దక్కుతాయి



విశాఖ పరిపాలన రాజధాని అయితే ఉత్తరాంధ్ర వాసుల ఎన్నో ఏళ్ల కల నెరవేరినట్లే. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటనతో రాజధాని తరలివస్తుందనే నమ్మకం కలిగింది. పేరొందిన విద్యా సంస్థలు ఇక్కడకు వస్తాయి. యువతకు ఉద్యోగాలు దక్కుతాయి. ముఖ్యంగా శ్రీకాకుళం, విజయనగరం ఉమ్మడి జిల్లాల నుంచి పూర్తిగా వలసలు తగ్గుతాయి. ఈ ప్రాంత వాసులకు ఎంతో మేలు జరుగుతుంది. దీన్ని ప్రతి ఒక్కరూ హర్షించాల్సిందే..

– ఇమంది పైడిరాజు, ఎస్టీయూ రాష్ట్ర కమిటీ కౌన్సిలర్

నేటి నుంచి విజయోత్సవాలు



విశాఖ పరిపాలన రాజధాని అయితే ఉత్తరాంధ్ర జిల్లాలు అభివృద్ధి చెందుతాయి. ఉత్తరాంధ్రలో ఉన్న యువత, ప్రజలంతా కోరుకునే విధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఢిల్లీ నుంచి రాష్ట్ర రాజధాని విశాఖే అని ప్రకటించి.. అందరిలోనూ ఉత్సాహం నింపారు. కొన్నాళ్లుగా విశాఖ పరిపాలన రాజధాని కావాలని ఇక్కడి ప్రజలు శాంతియుత కార్యక్రమాలు చేపడుతున్నారు. అఖిలపక్షంతో పాటు ఉత్తరాంధ్ర నాన్ పొలిటికల్ జేఏసీతో కలిసి వైఎస్సార్ సీపీ అనేక కార్యక్రమాలు నిర్వహించి.. ప్రజలకు అవగాహన కల్పించింది. బుధవారం నుంచి అన్ని నియోజకవర్గాల్లో పార్టీ తరఫున సంబరాలు నిర్వహిస్తాం.

– పంచకర్ల రమేష్‌బాబు, వైఎస్సార్ సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు

వికేంద్రీకరణతోనే అభివృద్ధి సాధ్యం



సుప్రీంకోర్టులో కూడా మూడు రాజధానులకు అనుకూలంగా తీర్పు వస్తుందని భావిస్తున్నాం. రాష్ట్ర పునర్ విభజన చట్టంలో అమరావతినే రాజధాని చేయాలనేది ఎక్కడా లేదు. కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన శివరామకృష్ణన్ కమిటీ పరిపాలన వికేంద్రీకరణతో రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని చెప్పింది. రాజ్యాంగపరమైన అంశాలన్నింటికీ దృష్టిలో పెట్టుకునే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మూడు రాజధానుల నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రమంతా బాగుండాలని ఉత్తరాంధ్ర నాన్ పొలిటికల్ జేఏసీ కోరుకుంటోంది. తక్కువ ఖర్చుతో మిగతా రాష్ట్రాల రాజధానులకు దీటుగా విశాఖ అభివృద్ధి చెందుతుంది. రాష్ట్రంలోని ఏ ప్రాంతం నుంచైనా పరిపాలన సాగించే అధికారం సీఎంకు ఉంది.

– లజపతిరాయ్, చైర్మన్, ఉత్తరాంధ్ర నాన్ పొలిటికల్ జేఏసీ

సక్రమంగా రేషన్ పంపిణీ

జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి శివప్రసాద్



మాట్లాడుతున్న డీఎస్‌వో శివప్రసాద్

చింతూరు: ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా రేషన్ పంపిణీ సక్రమంగా నిర్వహించాలని జిల్లా పౌరసరఫరాల అధికారి శివప్రసాద్ సూచించారు. మంగళవారం ఆయన స్థానిక జీసీసీ కార్యాలయంలో నాలుగు మండలాల సీడీపీవోలు, డీలర్లు, గొడౌన్ ఇన్‌చార్జిలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాలతో పాటు మధ్యాహ్న భోజన పథకం, ప్రజా పంపిణీ వ్యవస్థకు సంబంధించిన రేషన్ సరకులను ప్రతినెలా 17వ తేదీలోపు పంపిణీ చేయాలని సూచించారు. అనంతరం ఆయన చింతూరు, వీఆర్‌పురం తహసీల్దార్ కార్యాలయాల్లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఫిబ్రవరి నుంచి తప్పనిసరిగా ప్రతినెలా ఒకటి నుంచి 17 లోపు కచ్చితంగా రేషన్ పంపిణీకి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రతినెలా ఒకేసారి బియ్యం, పంచదార, కందిపప్పును కార్డుదారులకు అందజేసేలా డీలర్లు అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. రేషన్ పంపిణీ, అంగన్‌వాడీ సెంటర్లకు సరకుల సరఫరా, గ్యాస్ పంపిణీ, ధాన్యం కొనుగోలుకు సంబంధించి ఏమైనా సమస్యలుంటే ప్రజలు 1967 టోల్‌ఫ్రీ నంబరుకు ఫిర్యాదు చేసి పరిష్కరించుకోవచ్చని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ మేనేజర్ గణేష్ పాల్గొన్నారు.

శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యం

- బోధనపై నిర్లక్ష్యం వద్దు
- అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ



జాముగుడ ఆశ్రమ బాలికల పాఠశాలలో రికార్డులు తనిఖీ చేస్తున్న ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

డుంబ్రిగుడ: టెన్త్ పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ ఆదేశించారు. మంగళవారం స్థానిక గిరిజన సంక్షేమశాఖ ఆశ్రమ బాలికల పాఠశాలలను సందర్శించిన ఆయన రికార్డులను తనిఖీ చేశారు. ప్రభుత్వం చేపట్టిన నాడు–నేడు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో తగదాలు పెట్టుకుని విద్యాబోధనపై నిర్లక్ష్యం చేయవద్దని హెచ్చరించారు. పాఠశాల నిర్వహణపై ఎటువంటి ఫిర్యాదులు చేసుకోకుండా విద్యాబోధనపై దృష్టి పెట్టి ఉపాధ్యాయులు చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు. ఈ విషయంలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ప్రభుత్వం పంపిణీ చేసిన ట్యాబ్‌లను విద్యార్థులు సక్రమంగా సద్వినియోగం చేసుకుని డిజిటల్ విద్యాబోధనపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని సూచించారు. టెన్త్ పబ్లిక్ పరీక్షల్లో శాత శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా పనిచేయాలని ఆయన సూచించారు.

డోలీలో రోగి తరలింపు



రోగిని డోలీలో మోసుకొని వస్తున్న గిరిజనులు

అనంతగిరి: మండలంలోని పినకోట పంచాయతీ గిరిశిఖర గ్రామమైన రాచకీలం గ్రామానికి చెందిన సుకూరు సింహాచలం(55) అనే గిరిజనుడు కొద్దిరోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. గ్రామానికి రహదారి సౌకర్యం లేకపోవడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తుల సాయంతో సుమారు 8 కిలోమీటర్ల మేర డోలీలో మోసుకొని కొండలు, గుట్టలు దాటుకుంటూ కొరాపర్తి గ్రామం వరకు తీసుకువచ్చారు. అక్కడి నుంచి ఆటోలో దేవరాపల్లి ఆస్పత్రికి తరలించారు. మలేరియా సోకినట్టుగా వైద్యసిబ్బంది గుర్తించారు.

ఖరీఫ్ రుణ లక్ష్యం రూ. 500 కోట్లు



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్



రుణాలను పంపిణీ చేస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

సాక్షి,పాడేరు: రానున్న ఖరీఫ్ సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా రూ.500 కోట్ల మేర రుణాలు పంపిణీ లక్ష్యమని కలెక్టర్ సుమిత్‌కుమార్ వెల్లడించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో బ్యాంకర్లు, చిన్నతరహా పరిశ్రమలు ప్రోత్సాహక అభివృద్ధి సంస్థ, వ్యవసాయశాఖ, డీఆర్‌డీఏ అధికారులతో 2022–2023 ఆర్థిక సంవత్సర రుణ ప్రణాళికల అమలుపై జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. వీటిపై సమీక్షించిన కలెక్టర్ పలు సూచనలు చేశారు. రబీలో రూ.447 కోట్ల మేర రుణాలు పంపిణీ లక్ష్యం కాగా, రూ.206 కోట్ల మేర మాత్రమే పంపిణీ చేశారన్నారు. మిగిలిన రూ.231 కోట్ల రుణాల పంపిణీ వేగవంతం చేయాలని ఆదేశించారు. సూక్ష్మ పరిశ్రమలు, ప్రధాన మంత్రి ఉపాధి కల్పనా పథకం, ముద్రా రుణాలు, ప్రధాన మంత్రి సూక్ష్మ ఆహారశుద్ధి పరిశ్రమల క్రమబద్ధీకరణ పథకం, జగనన్న బడుగు వికాస యూనిట్ల నెలకొల్పనకు రుణాలు అందజేయాలని కోరారు. రైతులకు మాత్రమే రుణాలు పంపిణీ చేస్తున్నారని, భూములకు కాదనే విషయాన్ని బ్యాంకర్లు గుర్తించాలని సూచించారు.స్వయం సహాయక సంఘాల పొదుపునకు మించి రుణాలు, మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజీ రుణాలు జాప్యం లేకుండా మంజూరు చేయాలని ఆయన ఆదేశించారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల అర్హత మేరకు రుణాల పంపిణీకి చర్యలు తీసుకోవాలని సూచించారు. బీమా పథకాలపై గిరిజనులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రధానమంత్రి సురక్ష యోజన పథకంలో 18 నుంచి 70 ఏళ్లలోపు వారు రూ.20 బీమా ప్రీమియం చెల్లిస్తే రూ.2 లక్షల బీమా పరిహారం, ప్రధాన మంత్రి బీమా యోజన పథకంలో 18 నుంచి 50 ఏళ్లలోపు వారు ఏడాదికి రూ.346 చెల్లిస్తే రూ.2లక్షల వ్యక్తిగత బీమా పరిహారం పొందవచ్చునన్నారు. అలాగే అటల్ పెన్షన్ యోజన పథకంలో నమోదు చేసుకున్నవారికి ప్రతి నెలా రూ.వెయ్యి నుంచి రూ.5వేల వరకు పింఛన్ సొమ్ము పంపిణీ జరుగుతుందన్నారు. పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ గిరిజన యువతీ యువకులకు స్వయం ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించి, వారి ఆర్థికాభివృద్ధి లక్ష్యంగా రుణాలు మంజూరు చేయాలని కోరారు. పర్యాటక ప్రాంతాలలో స్వయం ఉపాధి పథకాలను విస్తృతం చేయాలని కలెక్టర్ సూచించారు.

అటవీ హక్కు పత్రాల రైతులకు రుణాల పంపిణీ

అటవీ హక్కుల చట్టం కింద సాగు భూములకు పట్టాలు పొందిన గిరిజన రైతులకు తొలిసారిగా డీసీసీబీ బ్యాంకు రుణాలు మంజూరు చేసింది. 23మంది రైతులకు రూ.20వేల చొప్పున రూ.4.60 లక్షలను చెక్కు రూపంలో కలెక్టర్, పాడేరు ఎమ్మెల్యేలు ఆయా లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అలాగే పీఎంఈజీపీ పథకంలో వ్యవస్థాపక అభివృద్ధిపై శిక్షణ పూర్తిచేసుకున్న 38 మందికి ధ్రువపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాడేరు ఐటీడీఏ పీవో ఆర్.గోపాలకృష్ణ, యూనియన్ బ్యాంకు రీజినల్ అధికారి కె.నటరాజ్, ఏపీజీవీబీఆర్‌ఎం ఉదయ్‌కిరణ్, ఎల్‌డీఎం రవితేజ్, మెప్మా పీవో శ్రీనివాసరావు, సీడ్స్ సీఈవో జగన్నాథరాజు, డీసీసీబీ సీఈవో ఎస్.వర్మ, జిల్లా పరిశ్రమల కేంద్రం ఏడీ నవీన్‌కుమార్, డీఆర్‌డీఏ పీడీ మురళీ తదితరులు పాల్గొన్నారు.

పోలవరం పవర్ ప్రాజెక్ట్‌కు త్వరితగతిన భూసేకరణ

జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాస్



పవర్ ప్రాజెక్టు పనులను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాస్, సబ్‌కలెక్టర్ శుభం బన్సల్

దేవీపట్నం: పోలవరం జలవిద్యుత్ కేంద్రం నిర్మాణానికి సంబంధించి భూసేకరణ త్వరగా పూర్తి చేసి ఏపీ జెన్‌కో అధికారులకు అప్పగించాలని జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాస్ ఆదేశించారు. దేవీపట్నం మండలం పూడిపల్లి పంచాయతీ అంగుళూరు వద్ద నిర్మిస్తున్న పవర్ ప్రాజెక్టును మంగళవారం ఆయన రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం బన్సల్‌తో కలిసి పరిశీలించారు.

ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ పవర్ ప్రాజెక్టు నిర్మాణానికి అవసరమైన 123 హెక్టార్ల భూమిని జెన్‌కోకు రెవెన్యూ పరంగా అప్పగించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అయితే రెవెన్యూ పరంగా అప్పజెప్పాల్సిన భూమిలో జెన్‌కో పవర్ ప్రాజెక్టు పనులు జరుగుతున్నాయన్నారు. రికార్డు పరంగా అప్పగిస్తే ప్రక్రియ పూర్తవుతుందన్నారు.

అంగుళూరు వద్ద జరుగుతున్న పవర్ ప్రాజెక్టు పనులను పరిశీలించారు. జాయింట్ కలెక్టర్ దేవీపట్నం తహసీల్దార్ రామకృష్ణ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

అనంతగిరి: అనంతగిరి పెద్దూరు గ్రామానికి చెందిన పి. రామచందర్(35)అనే గిరిజన యువకుడు ద్విచక్రవాహనంపై మైదాన ప్రాంతానికి వెళుతుండగా, అనంతగిరి ఊటగెడ్డ మలుపు వద్ద ఎస్‌కోట నుంచి ఎదురుగా వస్తున్న ఆర్టీసీ డీలక్స్ బస్సును ఢీకొట్టడంతో రామచందర్ గాయాలపాలయ్యాడు. తలకు దెబ్బ తగలడంతో యువకుడు అపస్మారకస్థితికి చేరుకున్నాడు. స్థానికుల సాయంతో క్షతగాత్రుడిని ఎస్‌కోట ఆస్పత్రికి తరలించారు.

రావణాపల్లి రికార్డ్ అసిస్టెంట్‌కు గాయాలు


గాయపడిన సన్యాసిపడాల్

కొయ్యూరు : రావణాపల్లి బాలికల ఆశ్రమ పాఠశాలలో రికార్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న సన్యాసిపడాల్‌ను మంగళవారం సాయంత్రం వెనుకగా వచ్చిన ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. ఆయన పాఠశాల నుంచి బయటకు వచ్చి బస్సు కోసం వేచి ఉండగా అటుగా వస్తున్న ద్విచక్ర వాహనం అతనిని ఢీకొట్టింది. దీంతో తలకు, కాళ్లకు తీవ్ర గాయాలు కావడంతో వెంటనే నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు.ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు.

బైక్ ప్రమాదంలో ఇద్దరికి గాయాలు


క్షతగాత్రుడు

హుకుంపేట : మండలంలోని తీగలవలస పంచాయతీ ఆంధ్రా-ఒడిశా సరిహద్దు ప్రధాన రహదారి గరుడాపల్లిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. తడిగిరి పంచాయతీ అల్లంపుట్టు గ్రామానికి చెందిన కొర్ర గణేష్, కురడ ప్రభాకర్ తమ గ్రామం నుంచి ఒడిశా ప్రాంతం వైపు ద్విచక్ర వాహనంపై వెళ్లుండగా బైక్ అదుపు తప్పి గరుడాపల్లి గ్రామ సమీపంలో లోయలో పడ్డారు. తీవ్రంగా గాయపడిన వారిని స్థానికులు ప్రైవేటు వాహనంలో పాడేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రభాకర్ పరిస్థితి విషమంగా ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు.

శిశు మరణాలు నివారించాల్సిందే

- సంభవిస్తే వైద్యాధికారులదే బాధ్యత
- కలెక్టర్ సుమిత్‌కుమార్


మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

సాక్షి, పాడేరు: జిల్లాలోని శిశు మరణాలపై సీరియస్‌గా స్పందించాలని, ఒకవేళ్ల సంభవిస్తే సంబంధిత వైద్యాధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందని కలెక్టర్ సుమిత్‌కుమార్ స్పష్టం చేశారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాలోని వైద్యాధికారులతో నిర్వహించిన సమావేశంలో అయన మాట్లాడారు. ఫిబ్రవరి నుంచి శిశు మరణాలు సంభవిస్తే సంబంధిత వైద్యాధికారులు బాధ్యులుగా భావించాల్సి వస్తుందన్నారు. కేజీహెచ్‌కు ప్రతీ కేసును రిఫర్ చేయడం తగదని, జిల్లా ఆస్పత్రిలోని అన్ని సౌకర్యాలతో పాటుగా చిన్నపిల్లల వైద్యనిపుణులు ఉన్నందున సౌకర్యాలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రిఫర్ చేసిన ఆస్పత్రికి తరలించేందుకు సమయపడుతున్నందున శిశుమరణాలు సంభవిస్తున్నాయన్నారు. దీనిపై సీరియస్‌గా స్పందించాలని ఆదేశించారు. గర్భిణులు, బాలింతలపై ప్రత్యేక దృష్టి సారించాలని, వైద్యాధికారులు గ్రామాల్లో పర్యటిస్తూ, ఆశ, ఏఎన్‌ఎంల నుంచి సమాచారం తీసుకోవాలని కోరారు. జిల్లా ఆస్పత్రిలోని మాతాశిశు కేంద్రంలోని రెండు నియోనాటల్ వెంటిలేటర్లు, ఆక్సిజన్ మాస్కులు, కృత్రిమ పంపింగ్‌కు సీపేప్ కొనుగోలు చేసి అందిస్తామని పేర్కొన్నారు. అలాగే కనీసం 50 ఆక్సిజన్ సిలిండర్లు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ, అసిస్టెంట్ కలెక్టర్ శ్రీవాస్తవ, డీఎంహెచ్‌వో జమాల్‌బాషా, అదనపు జిల్లా వైద్యాధికారి లీలాప్రసాద్, జిల్లా క్షయ నియంత్రణ అధికారి విశ్వేశ్వరనాయుడు పాల్గొన్నారు.

సికిల్‌సెల్ బాధితులకు మెరుగైన వైద్యసేవలు

జిల్లాలోని సికిల్‌సెల్ వ్యాధిగ్రస్తులను గుర్తించి, వారికి మెరుగైన వైద్యసేవలను అందించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. హుకుంపేట మండలం మజ్జివలసలో గాయత్రి విద్యాపరిషత్ ఆస్పత్రి రిసెర్చ్ కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించనున్న వైద్యశిబిరంపై కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన పలు సూచనలు చేశారు. ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ మాట్లాడుతూ సికిల్‌సెల్ వ్యాధిగ్రస్తుల వివరాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ శ్రీవాస్తవ, డీఎంహెచ్‌వో జమాల్‌బాషా, డీఈవో రమేష్, డీడీ కొండలరావు, గాయత్రి విద్యాపరిషత్ ఆస్పత్రి ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రజని, అదనపు పర్యవేక్షకుడు ధర్మారావు పాల్గొన్నారు.

గిరిజనులకు రగ్గులు, దుస్తుల పంపిణీ

సీఆర్పీఎఫ్ ఆధ్వర్యంలో సివిక్ యాక్షన్ ప్రోగ్రాం


గిరిజనులకు సామగ్రి అందజేస్తున్న సీఆర్పీఎఫ్ అధికారులు

చింతూరు: మండలంలోని ఏడుగురాళ్లపల్లిలో సీఆర్పీఎఫ్ డీ-141 బెటాలియన్ ఆధ్వర్యంలో మంగళవారం సివిక్ యాక్షన్ కార్యక్రమం నిర్వహించారు. ఏడుగురాళ్లపల్లి పంచాయతీ పరిధిలోని గ్రామాలకు చెందిన గిరిజనులకు సోలార్ లాంతర్లు, రగ్గులు, దుస్తులు, దోమతెరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బెటాలియన్ సెకండ్ ఇన్ కమాండెంట్ కమలవీర్ యాదవ్ మాట్లాడుతూ యువత చెడుమార్గాల్లో పయనించకుండా సమాజ శ్రేయసుకు పాటు పడాలని సూచించారు. అసాంఘిక శక్తుల జోలికి పోకుండా గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో చింతూరు ఎస్‌ఐ యాదగిరి, సీఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ కృష్ణారావు, సర్పంచ్‌లు పాయం చంద్రయ్య, సవలం సత్తిబాబు పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో ప్రతిభ

బంగారు పతకం సాధించిన మధుచందన



చింతూరు: రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో చింతూరుకు చెందిన గుత్తుల మధుచందన బంగారు పతకం సాధించింది. జగ్గయ్యపేటలో జరుగుతున్న రాష్ట్రస్థాయి వెయిట్‌లిఫ్టింగ్ స్కూల్‌గేమ్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో అండర్-19 బాలికల విభాగం 81ప్లస్ కేటగిరీలో ఆమె ప్రతిభ కనబరచింది. ఆమె బంగారు పతకం సాధించడంపై కోచ్ గోలి గంగాధర్‌తో పాటు గ్రామస్తులు అభినందించారు.

పర్యావరణ హితంగా బొర్రా

- తీర్చిదిద్దేందుకు కృషి
- డీఎల్పీవో పీఎస్ కుమార్


వార్డు మెంబర్లు, గిరిజనులకు అవగాహన కల్పిస్తున్న డీఎల్పీ కుమార్

అనంతగిరి: లివింగ్ వాటర్ ఇండియా సంస్థ సహకారంతో బొర్రా పంచాయతీని పర్యావరణహితంగా తీర్చిదిద్దుదామని డీఎల్పీవో పీఎస్ కుమార్ అన్నారు. మండలంలోని బొర్రా పంచాయతీ కేంద్రంలోని సచివాలయంలోని లివింగ్ వాటర్ ఇండియా సంస్థ ఆధ్వర్యంలోని పారిశుధ్యం, వ్యక్తిగత పరిశుభ్రత, తాగునీరుపై అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. ప్రముఖ పర్యాటక కేంద్రమైన బొర్రా గుహలకు వేలాది పర్యాటకులు తరలివస్తుంటారని ప్లాస్టిక్ నిషేధిస్తూ, పర్యావరణ కాపాడేందుకు, సంస్థ సహకారంతో ముందుకు సాగాలని సూచించారు. గ్రామ పంచాయతీని ఆదర్శ పంచాయతీగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకారం అందించాలని కోరారు. పంచాయతీ కేంద్రంలో ఖాళీగా ఉన్న భవనాన్ని సులభ్ కాంప్లెక్స్‌కు కేటాయించాలని తీర్మానించారు. లివింగ్ వాటర్ ఇండియా నేషనల్ డైరెక్టర్ డేవిడ్ మాట్లాడుతూ సబ్‌సెంటర్ వద్ద మినరల్ ప్లాంట్ ఏర్పాటుకు చేస్తున్నామని, శివారు గ్రామాలకు సేంద్రియ ఎరువులు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అప్పారావు, కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, వార్డు మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

జోరుగా బొడ్డెంగుల అమ్మకాలు


బొడ్డెంగులు

సాక్షి,పాడేరు: ఏజెన్సీలో బొడ్డెంగుల అమ్మకాలు జోరందుకున్నాయి. పురుగులను పోలిఉండే వీటిని ఈతచెట్ల మొదళ్లను తవ్వి బయటకు తీసి విక్రయిస్తున్నారు. వీటిని ఎంతో ఇష్టంగా తినేందుకు ఆసక్తి చూపుతున్నందున మార్కెట్లో ఎంతో డిమాండ్ ఉంది. స్థానిక పాత బస్టాండ్ వద్ద నాలుగు బొడ్డెంగులను రూ.10కు విక్రయిస్తున్నారు. కొనుగోలు చేసేందుకు స్థానికులు పోటీపడుతున్నారు.

ఉపాధి పనుల పరిశీలన


పనులను పరిశీలిస్తున్న అధికార బృందం

రాజవొమ్మంగి: మండలంలోని జడ్డంగి పంచాయతీ పరిధిలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను కమిషనర్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ (సీఆర్‌డీ) నుంచి వచ్చిన బృందం మంగళవారం పరిశీలించింది. ఈ బృందంలో విజయవాడ నుంచి వచ్చిన స్టేట్ టెక్నికల్ రిసోర్స్ టీమ్ సభ్యులు, టీమ్ అడ్వైజర్లు వి.వి.కిరణ్, కె.సుధీర్ ఉన్నారు. జడ్డంగి పరిధిలోని చిన్నయ్యపాలెం, దోనెలపాలెం ప్రాంతాల్లో జరిగిన పనులకు సంబంధించి రిజిస్టర్ల నిర్వహణ, కూలీలకు ఇస్తున్న వేతనం, మస్టర్లు, పనుల వివరాల అప్‌లోడ్ తదితర అంశాలను పరిశీలించారు. జడ్డంగి సచివాలయం పరిధిలో 2021-22 ఆర్థిక సంవత్సరంలో రూ.7.23లక్షల వ్యయంతో జరిగిన రోడ్డు పనులు, రూ.1.15లక్షలతో జరిగిన కందక తవ్వకాలు, రూ.2.67లక్షలతో చేపట్టిన ఎవెన్యూ ప్లాంటేషన్, రూ.91వేలతో జరిగిన లెవెలింగ్ పనులు, రూ.2.85లక్షలతో జరిగిన ఉద్యానవనాల పెంపకం, రూ.3.5 లక్షలతో చేపట్టిన చెరువుల పూడికతీత పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, రికార్డులు తనిఖీ చేశారు. నివేదికను పంచాయతీ రాజ్ కమిషనర్‌కు (సీపీఆర్) నివేదిస్తామన్నారు. ఏపీడీ భాగ్యరావు, స్థానిక ఉపాధి ప్రోగ్రాం ఆఫీసర్ ఎంపీడీవో బాపన్నదొర, ఏపీఓ సురేష్, ఉపాధి సిబ్బంది, వేతనదారులున్నారు.

గొడవపడి బావిలో దూకిన భార్యాభర్తలు

భర్త మృతి


శివరామ్ (ఫైల్)

హుకుంపేట : భార్యాభర్తలు గొడవపడి ఇద్దరూ బావిలో దూకిన ఘటనలో భర్త మృతి చెందగా, భార్య క్షేమంగా బయటపడింది. మండలంలో జరిగిన ఈ విషాద ఘటనపై ఎస్‌ఐ సతీష్ అందించిన వివరాలిలా ఉన్నాయి. కొట్నాపల్లి పంచాయతీ కేంద్రానికి చెందిన గెమ్మెలి శివరామ్, అతని (29) భార్య అన్నపూర్ణ తమ పాపకు సంవత్సరం నిండడంతో ఆనందంగా జన్మదిన వేడుకలు నిర్వహించారు. అనంతరం శివరామ్ సెల్‌ఫోన్‌ను భార్య అడగగా ఇద్దరి మధ్య గొడవకు దారి తీసింది. గొడవ ముదిరి ప్రతిదానికి నన్ను అనుమానించడం, గొడవపడడం తగదని, ఈ బతుకు నాకు ఎందుకంటూ భర్త శివరాం గ్రామంలోని బావిలో దూకేశాడు. అతని వెంటే భార్య అన్నపూర్ణ కూడా అదే బావిలో దూకింది. ఈ విషయన్ని గుర్తించిన గ్రామస్తులు వారిద్దరినీ కాపాడేందుకు బావిలో దిగి బయటికి తీశారు. తీవ్ర గాయాలైన శివరామ్ అక్కడికక్కడే మృతి చెందగా భార్య అన్నపూర్ణ ప్రాణాలతో బయటపడింది. ఈ విషయం తెలుసుకున్న ఎస్ ఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేశారు.

పూరిల్లు దగ్ధం.. 2 లక్షల ఆస్తి నష్టం


కాలిబూడిదయిన పూరిల్లు

వై.రామవరం : మండలంలోని పి.యర్రగొండ పంచాయతీ కోకితగొంది గ్రామానికి చెం దిన గ్రామ వలంటీరుగా పనిచేస్తున్న రోలిపల్లి వీవీ సత్యనారాయణరెడ్డికి చెందిన పూరిల్లు మంగళవారం సాయంత్రం అగ్ని ప్రమాదంలో కాలి బూడిదైంది. సుమారు రూ.2 లక్షలు ఆస్తి నష్టం వాటిల్లింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఈ ప్రమాదం జరిగి సర్వం కోల్పోయి ఆ కుటుంబీకులు కట్టుబట్టలతో మిగిలారు. విద్యుత్ షార్టుసర్క్యూట్ వల్ల ఈ ప్రమాదం జరిగి ఉండవచ్చునని గ్రామస్తులు భావిస్తున్నారు. తహసీల్దార్ కె.సుధాకర్ ఆదేశాల మేరకు వీఆర్‌వో గుడ్ల రాజు సంఘటన స్థలానికి చేరుకుని, వివరాలు తెలుసుకున్నారు. తహసీల్దార్‌కు నివేదిక సమర్పించి సహాయం అందజేస్తామని వీఆర్‌వో తెలిపారు.

జీవ నియంత్రణ పద్ధతులతో పైరుకు రక్షణ

అడ్డతీగల: జీవ నియంత్రణ పద్ధతుల ద్వారా పంటల రక్షణ సాధ్యమని పందిరిమామిడి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు టి.క్రాంతికుమార్, ఎస్.చిరంజీవి సూచించారు. అడ్డతీగల, గంగవరం మండలాలకు చెందిన వ్యవసాయ, ఉద్యాన సహాయకులకు అడ్డతీగలలో మంగళవారం జీవరసాయనాల వినియోగం, జీడిమామిడిలో సమగ్ర సస్యరక్షణపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు జీవ నియంత్రకాలతో విత్తన, నారు శుద్ధి, ట్రైకోడెర్మా వినియోగించే విధానం, ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. వీటి వినియోగం వల్ల నారు, మొదలు, వేరుకుళ్లు, ఎండు తెగులును నివారించవచ్చన్నారు. జీడిమామిడిలో అంటు మొక్కల ప్రాముఖ్యత, నాటుకునే విధానం, కొమ్మ కత్తిరింపులు, తెగుళ్లు, పురుగులు, కలుపు నివారణపై అవగాహన కల్పించారు. సమగ్ర సస్యరక్షణకు సంబంధించిన పరికరాలు అవసరమైన రైతులు తమ పేర్లు నమోదు చేసుకోవాలని ఐటీడీఏ పీవో ఉద్యానవనశాఖాధికారి రాంబాబు సూచించారు. అడ్డతీగల, గంగవరం మండల వ్యవసాయాధికారులు సువర్ణకుమారి, విశ్వనాథరాజు తదితరులు పలు అంశాలపై అవగాహన కల్పించారు.

ట్రైనీ అధికారుల పర్యటన


శిక్షణ కోసం వచ్చిన ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు

మోతుగూడెం: తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాద్ దూలపల్లి ఫారెస్ట్ అకాడమీ నుంచి మంగళవారం 40 మంది ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు శిక్షణ తరగతులు నిమిత్తం చింతూరు, లక్కవరం అటవీ రెంజ్‌కి వచ్చారు. ముందుగా చింతూరు డిపోకు వచ్చి అక్కడ నుంచి గొడ్లగూడెం అడవీలోని టేకు చెట్లు విత్తనాల చెట్లను, రోజ్ వుడ్ చెట్లు, వెదురు చెట్లను పరిశీలించారు. పొల్లూరు జలపాతాలను, ఫోర్‌బే అడవులను చూసి శిక్షణ తీసుకున్నారు. వారి వెంట లక్కవరం ఇన్‌చార్జి రేంజర్ బి.బి.కొండలరావు, డీఆర్‌వో సత్యనారాయణ రాజు, గార్డు వెంకట్ ఫారెస్ట్ సిబ్బంది, బేస్ క్యాంపు సిబ్బంది పాల్గొన్నారు.

మన్యంలో మబ్బు వాతావరణం



సాక్షి,పాడేరు: వాతావరణ మార్పులతో మన్యంలో ఉదయం నుంచి మబ్బులతో చల్లటి వాతావరణం నెలకొంది. మంగళవారం పాడేరు మండలం మినుములూరులో 10డిగ్రీలు, చింతపల్లిలో 11డిగ్రీలు, అరకులోయలో 11.6 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. పొగమంచు కురవలేదు. ఆకాశమంతా మబ్బులు కమ్ముకున్నాయి.రాత్రి పాడేరు పట్టణ పరిధిలో జల్లులు కురిశాయి.

లోయలోకి దూసుకెళ్లిన కారు

- ముగ్గురికి గాయాలు
- రంపచోడవరం ఏరియా తరలింపు


చికిత్స పొందుతున్న శ్రీనివాస్


గాయపడిన అనూష

మారేడుమిల్లి : మారేడుమిల్లి-చింతూరు ఘాట్ రోడ్డులో కారు అదుపు తప్పి లోయలోకి దూసుకుపోయిన సంఘటనలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. భద్రాచలం దైవ దర్శనానికి వెళ్లి వస్తున్న కారు మంగళవారం సాయంత్రం ప్రమాదానికి గురైంది. విశాఖపట్నానికి చెందిన ముగ్గురు సోమవారం భద్రాచలంలోని సీతారాముల దర్శనానికి మారుతి స్విఫ్ట్ కారులో వెళ్లారు. దైవ దర్శనం అనంతరం మంగళవారం తిరుగు ప్రయాణమయ్యారు. మారేడుమిల్లి-చింతూరు ఘాట్ రోడ్డలోని చైనా వాల్ సమీపంలోని ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి కారు అదుపు తప్పి లోయలోకి దూసుకుపోయింది. అయితే చెట్టుకు అనుకుని ఆగడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఈ ఘటనలో పి.అనూష, వై.నాగబాబు, వి.శ్రీనివాస్ తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదం సమయంలో అటుగా వస్తున్న వాహనాల వారు గమనించి తీవ్రంగా గాయపడిన ముగ్గుర్ని మారేడుమిల్లి పీహెచ్‌సీకి తరలించారు. అక్కడ వైద్య సేవలు అనంతరం మెరుగైన వైద్యం కోసం 108 అంబులెన్స్‌లో రంపచోడవరం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై మారేడుమిల్లి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

నవభారత నిర్మాణంలో వర్సిటీలే కీలకం

- పటిష్టమైన ఉన్నత విద్యావ్యవస్థతో అభ్యున్నతి సాధ్యం
- యువతలో పరిశోధనపై ఆసక్తి పెంపొందించాలి
- సౌత్‌జోన్ వీసీల సదస్సులో గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ పిలుపు


కార్యక్రమానికి హాజరైన ఉపకులపతులు



ఏయూ సంచికను ఆవిష్కరిస్తున్న గవర్నర్

ఏయూక్యాంపస్: ఆత్మనిర్భర్ భారత్‌ను సాకారం చేస్తూ.. నవ్యభారతావని నిర్మాతలను తీర్చిదిద్దే బాధ్యతను విశ్వవిద్యాలయాలు స్వీకరించాలని గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ పిలుపునిచ్చారు. బీచ్‌రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో మంగళవారం అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీస్ సౌజన్యంతో ఏయూ నిర్వహిస్తున్న సౌత్ జోన్ వైస్ చాన్సలర్స్ మీట్ 2023 'రీసెర్చ్ అండ్ ఎక్స్‌లెన్స్ ఫర్ ట్రాన్స్‌ఫర్మేటివ్ హయ్యర్ ఎడ్యుకేషన్' సదస్సును గవర్నర్ ప్రారంభించారు. అనంతరం వివిధ రాష్ట్రాల నుంచి విచ్చేసిన ఉపకులపతులనుద్దేశించి మాట్లాడారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ఒకటిగా విద్య రంగం వృద్ధి, ఉపాధి అవకాశాలు పెంపు, మెరుగైన వైద్య సేవలు దేశంలో పెరుగుతున్నాయన్నారు. దేశ అభివృద్ధికి ఉన్నత విద్య ఎంతో ప్రధానమైన అంశం అన్నారు. భవిష్యత్ నాయకులు తయారు చేయడానికి జ్ఞానం, అధునాతన నైపుణ్యాలను అందించడం ద్వారా దేశ నిర్మాణం చేయాలన్నారు. దీని ఫలితంగా బలమైన సామాజిక ఆర్థిక వ్యవస్థను నిర్మించడం వీలవుతుందన్నారు. నూతన విద్య విధానంలో భాగంగా పరిశోధనలకు ప్రాధాన్యం పెరిగిందన్నారు. పరిశోధన రంగంలో పెట్టుబడులు పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ప్రపంచ స్థాయి ర్యాంకింగ్‌లో అత్యుత్తమ స్థానంలో భారతీయ విశ్వవిద్యాలయాలు స్థానం సాధించాలని పిలుపునిచ్చారు. విద్యార్థుల్లో పరిశోధన ఆలోచనలు, ఆసక్తిని పెంచే విధంగా వీసీలు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.

ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాదరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులను పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా, అంతర్జాతీయంగా అనుసంధానం చేస్తూ తీర్చిదిద్దుతున్నామన్నారు. ఏయూలో నెలకొల్పిన టెక్నాలజీ ఇన్నోవేషన్ హబ్ 34 స్టార్టప్‌లకు వేదికగా నిలుస్తోందన్నారు. నాస్కామ్ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ 17 స్టార్టప్‌లను తీర్చిదిద్దిందన్నారు. అవంతి ఫీడ్స్‌తో ఏర్పాటు చేసిన స్కిల్ సెంటర్, ఫుడ్ ప్రాసెసింగ్, టెస్టింగ్ ఇంక్యుబేషన్ సెంటర్, ఫార్మా టెస్టింగ్ లేబొరేటరీ, మెడికల్ జెనిటిక్స్ రీసెర్చ్ సెంటర్, టికాబ్స్‌తో విద్యార్థులను ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దుతున్నట్లు చెప్పారు. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్నోవేషన్ కౌన్సిల్(ఐసీసీ) ఫోర్ స్టార్ రేటింగ్ సాధించడం గర్వంగా ఉందన్నారు. సెయింట్ లూక్స్ సంస్థతో ఏర్పాటు చేస్తున్న మ్యూజిక్ ప్రొడక్షన్ స్టూడియో, ఐఐఎం విశాఖపట్నంతో నిర్వహిస్తున్న స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్, విభిన్న పరిశ్రమల సహకారంతో ఏర్పాటైన 18 చెయిర్ ప్రొఫెసర్లు, 1000 దాటిన విదేశీ విద్యార్థుల సంఖ్య ఏయూ గర్వకారణమన్నారు.

అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీస్ అధ్యక్షుడు ఆచార్య సురంజన్ దాస్ మాట్లాడుతూ ఉన్నత విద్యను ఆంగ్లంతో పాటు స్థానిక భాషల్లో అందించాల్సిన అవసరాన్ని వివరించారు. ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య కె.హేమచంద్రారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్నత విద్యలో ప్రవేశాల జీఈఆర్‌ను 27.4 నుంచి 37.2 శాతానికి వృద్ధి చేసినట్లు చెప్పారు. ఐదు నిర్దిష్ట లక్ష్యాలను ఏర్పాటు చేసుకుని వాటిని సాధించే దిశగా పనిచేస్తున్నారు. హయ్యర్ ఎడ్యుకేషన్ ప్లానింగ్ బోర్డ్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల ఫలితంగా ఇంటర్ తర్వాత విద్యను ఆపివేసే వారి సంఖ్య గణనీయంగా తగ్గిందన్నారు. ఏఐయూ సెక్రటరీ జనరల్ డాక్టర్ పంకజ్ మిట్టల్ మాట్లాడుతూ 98 ఏళ్ల ఘన చరిత్ర కలిగిన ఏఐయూలో 924 విశ్వవిద్యాలయాలు సభ్యత్వం కలిగి ఉన్నాయన్నారు. దేశంలో పరిశోధనలు, పేటెంట్ల సంఖ్య మరింత పెరగాలన్నారు. కార్యక్రమంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆర్.పి సిసోడియా, ఉన్నత విద్యామండలి ఉపాధ్యక్షుడు కె.రామ్మోహనరావు, ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, సదస్సు నిర్వాహకులు ఆచార్య కె.రాంజీ, ఆచార్య బి.మోహన వెంకట రామ్, ఆచార్య జేమ్స్ స్టీఫెన్, డాక్టర్ ఎస్.రమాదేవి తదితరులు పాల్గొన్నారు. అనంతరం వర్సిటీ, ఏఐయూ తరపున గవర్నర్‌కు జ్ఞాపికలు బహూకరించి సత్కరించారు. కార్యక్రమం ఆరంభంలో ఏయూ సంగీత విభాగం విద్యార్థులు నృత్య ప్రదర్శనలో ఆహూతులను మంత్రముగ్ధులను చేశారు.